జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం

2







# సంగారెడ్డి మెదక్


శనివారం 29 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:10


# ఒకే రోజు వెయ్యికి పైగా కుల ధ్రువీకరణ దరఖాస్తులు



-ఎస్ఐఆర్ నోటీసులతో ప్రజల్లో అయోమయం

-పండుగ సెలవుల్లోనూ విధులు నిర్వహించిన రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు -ప్రతి నోటీసుకు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కాదు



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 28:**

ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో భాగంగా జారీ చేసిన నోటీసులు నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. నోటీసుల్లో పేర్కొన్న అంశాలపై సరైన అవగాహన లేకపోవడంతో పలువురు ఓటర్లు కుల ధ్రువీకరణ పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో ఒక్కరోజే వెయ్యి మందికి పైగా కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. మిగతా 2 లో

# కొత్త పెన్షన్ల మంజూరుకు

## - అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

## - అదనపు కలెక్టర్ పాండు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 28:-**

-ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం2026 కింద అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ పాండు తెలిపారు. మిగతా 2 లో



# కొత్త పెన్షన్ల మంజూరుకు అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

ఇందుకు సంబంధించిన పోస్టర్, బ్యానర్, కరపత్రాలను శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఏ అదనపు పీడీ సూర్యారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. జిల్లాలోని అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, రక్త సంబంధిత దివ్యాంగులు,కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత సామాజిక భద్రత పింఛన్లను అందిస్తోందన్నారు. కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్న వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### వితంతువులు 18 సంవత్సరాలు పైబడి, భర్త మరణ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి.

ఒంటరి మహిళలు:
18 సంవత్సరాలు పైబడి
భర్తతో విడిపోయి/వదిలివేయబడి కనీసం ఒక సంవత్సరం పూర్తయిన వారు అర్హులని,
గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు, పట్టణ ప్రాంతాల్లో 35 సంవత్సరాలు పైబడిన అవివాహితులు అర్హులని తెలిపారు.
దివ్యాంగులు
దివ్యాంగులకు
వయస్సుతో సంబంధం లేకుండా అర్హత ఉంటుంది.
ఎస్ఏడిఏఆర్ ఈఎం/ యుడిఐడి ధృవీకరణ ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉండాలి. (51 శాతం వినికిడి లోపం ఉన్నవారికి )

### రక్త సంబంధిత దివ్యాంగులు :

తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వ్యాధులతో బాధపడుతున్న వారు.
సదరం /యుడిఐడి ధృవీకరణ ఉండాలని తెలిపారు.

### కల్లుగీత కార్మికులు:



50 సంవత్సరాలు పైబడి,
కల్లుగీత కార్మికుల సహకార సంఘ సభ్యత్వం ఉండాలని,
ఎక్సైజ్ శాఖ ధృవీకరణ అవసరమని స్పష్టం చేసారు.
చేనేత కార్మికులు:
50 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని,చేనేత, జౌళి శాఖ ధృవీకరణ ఉండాలని తెలిపారు.

### ఫైలేరియా బాధితులు:

గ్రేడ్××, గ్రేడ్××× ఫైలేరియా వ్యాధిగ్రస్తులు. అర్హులైన వారు సంబంధిత గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు/మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు/పురపాలక కమిషనర్లు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. అలాగే ప్ట్రిజూం://ఎష్ట్రవఎబ్ప్ట్రుఖ్.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.ఱఅ- వెబ్‌సైట్‌లోని "జష్ట్రవఎబ్ప్ట్రు ాజూజూశ్రీఱఛ్‌ఱశీఅ ఖీశీతీఎం" బటన్ నొక్కి దరఖాస్తు ఫారాలను పొందవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకునే విధంగా మహిళా సమాఖ్యల సహకారంతో దరఖాస్తు ప్రక్రియ మరియు అవసరమైన ధృవపత్రాల విషయంలో సహాయం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హులైన వారు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పాండు కోరారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ప్రయోజనం అందేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# ఒకే రోజు వెయ్యికి పైగా కుల ధ్రువీకరణ దరఖాస్తులు

మొదటిపేజీ తరువాయి

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 2002 నాటి ఓటరు జాబితాలో వివరాల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించిన పలువురు ఓటర్లకు బూత్ స్థాయిలో బీఎల్ఓలు నోటీసులు అందజేశారు. నోటీసులు స్వీకరించిన ఓటర్లు సంబంధిత వివరాలు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించేందుకు బూత్‌ల వారీగా ప్రత్యేక తేదీలను కేటాయించారు. ఈ నెల 29వ తేదీ నుంచి నోటీసుల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది.

### కుల ధ్రువీకరణ పత్రం అవసరమనే ప్రచారంతో పరుగులు

నోటీసులు అందుకున్న కొందరు ఓటర్లకు కుల ధ్రువీకరణ పత్రం ఉంటే ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని ప్రచారం జరగడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు తరలివచ్చారు. ఒక్కసారిగా భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో రెవెన్యూ సిబ్బందిపై అదనపు పని భారం పడింది. అయితే ప్రతి ఎస్ఐఆర్ నోటీసుకు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కాదని, నోటీసులో పేర్కొన్న వివరాల ఆధారంగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను బీఎల్ఓ వద్ద సమర్పించి ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం ఉందని అధికారులు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఏ సందర్భంలో ఏ పత్రం అవసరమో ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో అవసరం ఉన్నా లేకపోయినా కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేస్తున్న పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు.

### బీఎల్ఓ వద్దే ధ్రువీకరణ

ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం తీసుకురావాల్సిన అవసరం లేదని ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. నోటీసులో పేర్కొన్న అంశాలను పరిశీలించి, అవసరమైన పత్రాలను మాత్రమే బీఎల్ఓ వద్ద సమర్పించి ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని అధికారులు వివరించాల్సిన అవసరం ఉంది. దీంతో అనవసరంగా రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసే వారి సంఖ్య తగ్గే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### పండుగ సెలవుల్లోనూ విధులు

ఈ నెల 26న మిలాద్ ఉన్ నబీ, 28న రక్షాబంధన్ పండుగలు ఉన్నప్పటికీ ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు విధులు నిర్వహించారు. సెలవు రోజుల్లోనూ ప్రజలకు సేవలందిస్తూ నోటీసుల స్వీకరణ, ఓటర్ల వివరాల పరిశీలన తదితర ప్రక్రియల్లో నిమగ్నమయ్యారు. ప్రజలకు ముందుగానే ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన కల్పించి ఉంటే అవసరం లేని కుల ధ్రువీకరణ దరఖాస్తులు తగ్గేవని, తద్వారా రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై ఏర్పడిన అదనపు పని భారం కూడా కొంత మేర తగ్గేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### భారీగా తగ్గిన ఓటర్ల సంఖ్య

ఎస్ఐఆర్‌కు ముందు నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 17,550 మంది ఓటర్లు ఉండగా, ఎస్ఐఆర్ అనంతరం 12,572 మంది ఓటర్లు మిగిలారు. వీరిలో 6,395 మంది పురుషులు, 6,175 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. గత జాబితాతో పోలిస్తే 4,978 మంది ఓటర్లు తగ్గిపోవడంతో తమ పేర్లు తుది ఓటరు జాబితాలో ఉన్నాయా లేదా అనే ఆందోళన ప్రజల్లో నెలకొంది.

### స్పష్టమైన అవగాహన కల్పించాలి

ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లకు ఏ పత్రాలు సమర్పించాలి, ఏ సందర్భంలో కుల ధ్రువీకరణ పత్రం అవసరం అనే అంశాలపై అధికారులు స్పష్టమైన సమాచారం అందించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా అవసరం లేని ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా బీఎల్ఓల ద్వారా సరైన మార్గదర్శకాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి



## - విచారణ కు ఆదేశం.- బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలకు ఆదేశం.

## - హెల్త్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ లతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ గైర్హాజరు, ప్రైవేట్ డాక్టర్ తో చికిత్స పై వివిధ పత్రికలలో వచ్చిన వార్త కథనాలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా క్రిస్టినా జెడ్ చొంగ్తు తో మాట్లాడారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి లో జరిగిన ఘటన పై విచారణ కు ఆదేశించారు. ఈ లాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో విధుల్లో ప్రైవేట్ డాక్టర్ ఉండటం, డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బాధిత కుటుంబాలకు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శ

## - అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.10 వేల ఆర్థికసాయం.

## - బాధిత కుటుంబాలకు 20వేల ఆర్థిక సహాయం.







మెదక్ (ప్రజాజ్యోతి )

నిజాంపేట మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామంలో పలు కుటుంబాలను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన గంగమ్మ ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఇటీవల గ్రామంలో రోడ్డు ప్రమాదం, అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాలను కూడా తిరుపతిరెడ్డి పరామర్శించారు. సుంచు స్వామి కుటుంబానికి రూ.5 వేలు, దుర్గోల నీలయ్య కుటుంబానికి రూ.5 వేలు, సుంచు ప్రేమ్‌రావు కుటుంబానికి రూ.5 వేలు, బోడబట్ల మల్లయ్య కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ప్రజలకు ఏ కష్టం వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా తెలిపారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో కల్వకుంట సర్పంచ్ అందె కొండల్‌రెడ్డి, రజాక్ పల్లి సర్పంచ్ కనకరాజు ఏడుపాయల ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బాలాగౌడ్,, చలమేటి నాగరాజు, మండల యువజన అధ్యక్షుడు మావురం రాజు, లచ్చపేట రాములుగౌడ్, సంగు స్వామి, వార్డు సభ్యుడు పంపరి నగేశ్, తాడెం మల్లేశం, నారా గౌడ్ వెంకటేష్, రాజునాయక్, నరేందర్‌నాయక్, పరశురాములు సుభాష్‌నాయక్, ఎల్లం యాదవ్, మంగలి నర్సింలు, ఉపసర్పంచ్ రాజశేఖర్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు బాలమల్లేశం, మల్లేశం, రాజు, స్వామి, లింగం, సుధాకర్, ప్రభాకర్, రామచంద్రం, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు రాఖీ కట్టిన అక్క

### - చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ

### - రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్లూకోట్ పోలీసులకు రాఖీ కట్టిన సోదరి





మెదక్ (ప్రజాజ్యోతి)

రాఖీ పౌర్ణమి సందర్భంగా మెదక్ జిల్లాలో పాపన్నపేట్ మండల పరిధిలోని బ్లూకోట్ పోలీసులకు ఓ సోదరి రాఖీ కట్టి పోలీసులపై తనకున్న అభిమానం, ఆత్మీయతను చాటుకున్నారు. సమాజంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు.మహిళలు వివిధ రంగాల్లో పనిచేస్తూ నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని, వారు ధైర్యంగా బయటకు వెళ్లగలుగుతున్నారంటే పోలీసుల భద్రతపై ప్రజలకు ఉన్న నమ్మకమే కారణమని అన్నారు."చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ" అంటూ పోలీసులకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.పండుగ రోజున సైతం కుటుంబాలకు దూరంగా ఉంటూ విధుల్లో నిమగ్నమై ప్రజలకు భద్రత కల్పిస్తున్న బ్లూకోట్ పోలీసుల సేవలను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది కూడా సోదరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ప్రజల భద్రతే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులపై ప్రజలకు ఉన్న విశ్వాసం, ఆత్మీయ అనుబంధాన్ని ఈ రాఖీ వేడుక మరోసారి చాటిచెప్పింది.

# మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ కుటుంబ సభ్యులతో రాఖీ పండుగ

మెదక్ (ప్రజా జ్యోతి)

రక్షాబంధన్ పురస్కరించుకొని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ.మల్లికార్జున్ గౌడ్ కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేసిన సోదరీమణులు.సోదర సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సంబరాలు ఆరేళ్ల వారి ఇంటి వెల్లివిరిశాయి. రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం మెదక్ పట్టణంలో ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ నివాసానికి చేరుకున్న వారి సోదరీమణులు రాణి , వాణి లు ఆరేళ్ల.



మల్లికార్జున్ గౌడ్ తో పాటు తోటి సోదరులైన ఆరేళ్ళ.జనార్దన్ గౌడ్ , శ్రీనివాస్ గౌడ్ లకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకొని వారి





ఆశీర్వాదం అన్నదమ్ములకు అందజేశారు.మల్లికార్జున్ గారి కూతురు సుధీక్షిత వారి సోదరులైన అభిరామ్ గౌడ్ , అశ్విత్ గౌడ్ , సాయి చైతన్యలకు రాఖీలు కట్టారు. ఇలా కుటుంబమంతా రాఖీ పండుగ సంబరాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్ గారు మాట్లాడుతూ అన్నాచెల్లెళ్లు, తోబుట్టువుల పవిత్రమైన ప్రేమకు మరియు అప్యాయతకు ప్రతీక అయిన ఈ రాఖీ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలను , ఆయురారోగ్యాలను నింపాలని వారు ఆకాంక్షించారు.

# హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి ఎస్సై రవి గౌడ్

కల్హేర్, 28. ఆగస్టు. ప్రజా జ్యోతి

కల్హే ర్ పోలీస్ స్టేషన్ ఎస్సై రవి గౌడ్ స్థానిక ద్విచక్ర వాహనదారులకు హెచ్చరిక జారీ చేశారు. వాహనాలు నడపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనల్ని కఠినంగా పాటించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాల ప్రమాదాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు.అంతేకాదు, ఎస్సై రవి గౌడ్ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. యువత ఉద్యోగ విద్యలో ముందుండి తల్లిదండ్రులకు గౌరవంగా ఉంటూ చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉండటానికి పిలుపునిచ్చారు.తల్లిదండ్రులను తమ పిల్లల కదలికలపై సజాగ్రతగా ఉండి, వారి స్నేహాలు, అలవాట్లపై ఆమెచేత అదుపు వహించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, అనుమతికంటే ఎక్కువ ప్రయాణికులతో ద్విచక్ర వాహనాలు నడపడం వంటి చర్యలు రోడ్డు భద్రత నిబంధనలకు విరుద్ధంగా ఉంటాయని పోలీసులు తెలిపారు.పోలీసులు స్థానిక ప్రజలకు నిబంధనలు పాటించి, అనవసర ప్రమాదాలు నివారించమని విజ్ఞప్తి చేశారు.




# విజేత హైస్కూల్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 28:

నారాయణఖేడ్ పట్టణంలోని విజేత హైస్కూల్‌లో ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు ప్రతీక అని అన్నారు. విద్యార్థుల్లో సోదరభావం, పరస్పర గౌరవం, ఆత్మీయత పెంపొందించడమే ఇలాంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు.పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకు పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు విలువలను అలవర్చుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.





# ప్లాట్ల కోసం వాగుకే ఎసరు..!

## - ప్లాట్ల కోసం నీటి ప్రవాహానికి చెక్..!

## - ముని దేవునిపల్లి రఘునాథ్ నియోసిటీ వెంచర్‌లో నాళాల కబ్జా..

## - వాగుపై రహదారి ఏర్పాటు.. వర్షపు నీరు ఎటు వెళ్లాలి?

## - భవిష్యత్‌లో ముంపు ముప్పు తప్పదా..

## - అధికారుల అనుమతులు ఉన్నాయా?

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మునిదేవునిపల్లి గ్రామ పరిధిలోని రఘునాథ్ నియోసిటీ వెంచర్‌లో నాళాలు, సహజ నీటి ప్రవాహ మార్గాలపై ఆక్రమణలు జరుగుతున్నాయి.స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్లాట్ల నిర్మాణానికి వాగు అడ్డుగా ఉందనే కారణంతో సహజంగా నీరు ప్రవహించే మార్గాన్ని పూడ్చివేసి, ఆ వాగుపైనే రహదారి ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.సహజంగా వర్షపు నీరు వెళ్లాల్సిన వాగును మట్టితో పూడ్చివేయడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే సమయంలో నీరు వెళ్లేందుకు మార్గం లేకపోతే వెంచర్‌లోని ప్లాట్లు, సమీప వ్యవసాయ భూములు, ఇళ్లపై ముంపు ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.

### ప్లాట్ల కోసం సహజ వాగుకే మంగళం?

వెంచర్ అభివృద్ధి పేరుతో సహజ నీటి ప్రవాహ మార్గాలను మార్చడం లేదా పూడ్చివేయడం జరిగితే సంబంధిత నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? వాగు, నాళాలపై రహదారి నిర్మాణానికి ఎవరు అనుమతించారు? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.వెంచర్‌కు సంబంధించిన లేఅవుట్ అనుమతుల్లో వాగు, నాళాలు, డ్రైనేజీ మార్గాలకు సంబంధించిన వివరాలు ఏమున్నాయి? ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితికి అనుమతించిన లేఅవుట్‌కు సంబంధం ఉందా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

సహజ నీటి ప్రవాహ మార్గాన్ని పూడ్చివేసినట్లు వస్తున్న ఆరోపణలపై పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్/సంబంధిత





శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాగు అసలు మార్గం ఎక్కడ ఉంది? ప్రస్తుతం దానిపై ఏ నిర్మాణాలు జరిగాయి? వాటికి అనుమతులు ఉన్నాయా? అనే విషయాలను స్పష్టం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజల భద్రత, భవిష్యత్ వర్షపు నీటి ప్రవాహం దృష్ట్యా సహజ నాళాలు, వాగులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్లాట్ల అభివృద్ధి కోసం సహజ నీటి మార్గాలను మూసివేసే పరిస్థితి ఉంటే దానిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఈ వ్యవహారంపై అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? లేక వాగు పూడ్చివేత ఆరోపణలు ఇలాగే మిగిలిపోతాయా? అనేది వేచి చూడాలి.

ప్రజాజ్యోతి

శనివారం 29 ఆగస్టు 2026

# మెదక్ లో కవితక్క టిఆర్ఎస్ పార్టీ సమావేశం

**మెదక్ (ప్రజా జ్యోతి)**




మెదక్ జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో, మెదక్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ మరియు నర్సాపూర్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ అపర్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మెదక్ నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ మరియు నర్సాపూర్ నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్‌చార్జ్ అపర్ణ మాట్లాడుతూ పలు ముఖ్యాంశాలను వెల్లడించారు. బీసీ ద్రోహి హరీష్ రావు పచ్చి బీసీ వ్యతిరేకి అని మరోసారి రుజువైందని బట్టి అజయ్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేసిన మాధవరెడ్డిని తన ఇంటికి పిలిపించుకుని, శాలువాతో సత్కరించి గౌరవించడం ఆయన బీసీ వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అన్నారు. కార్పొరేటర్‌గా పోటీ చేసినప్పుడు బీసీ సంఘాలు, తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తికి బీఆర్ఎస్ పార్టీలో, హరీష్ రావు వద్ద ఇంతటి ప్రాధాన్యత ఎందుకు ఇస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచే కుట్ర**

మెదక్ వేదికగా కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు హరీష్ రావు పెద్ద కుట్ర చేస్తున్నారని బట్టి అజయ్ ఆరోపించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎమ్మెల్యే స్థానాలు అన్నీ గెలుచుకున్న తర్వాత బీజేపీతో ఒప్పందం చేసుకుందాం" అని వ్యాఖ్యానించినట్లు బట్టి అజయ్ పేర్కొన్నారు.

**ఇలాంటి వ్యాఖ్యలు ఆయన రాజకీయ కుటిల బుద్ధికి పరాకాష్ట అని ఆయన విమర్శించారు.**

బీజేపీతో చీకటి ఒప్పందాలు రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్ రహస్యంహరీష్ రావు బీజేపీ, ఆర్ఎస్ఎస్ పెద్దలతో రహస్య మంతనాలు సాగిస్తున్నారని బట్టి అజయ్ ఆరోపించారు. ఇందుకు 'రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్' కేంద్రంగా మారిందని అన్నారు. అక్కడికి వచ్చే ఒక ఆర్ఎస్ఎస్ పెద్ద మనిషితో హరీష్ రావు పలుదఫాలుగా సమావేశమవుతున్నారని, ఆయన వచ్చిన ప్రతిసారీ తన కార్యక్రమాలను రద్దు చేసుకుని మరీ వెళ్లి చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. తన పదవిని అడ్డుపెట్టుకుని అవినీతి, వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడుతున్న హరీష్ రావు ప్రస్తుతం ముఖ్యమంత్రితో కూడా లాలూచీ పడ్డారని బట్టి అజయ్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన మెదక్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కేవల్ నందకిషోర్ కాసాపురం అశోక్ మెదక్ జిల్లా టీఆర్ఎస్ స్టూడెంట్ వింగ్ ఎండీ జునైద్ అబ్బాసు మరియు ఇతర నాయకులు, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది..

# 19 ఏళ్ల ఉద్యమం.. హక్కుల సాధనకు ఇంకా సుదీర్ఘ పోరాటం

## - వికలాంగుల సంక్షేమం మాటలకే పరిమితం కాకూడదు

## - రూ.6 వేల పింఛన్ హామీ అమలే ప్రధాన డిమాండ్

## - విద్య, ఉపాధి, సామాజిక భద్రతలో సముచిత వాటా కోసం వి.హెచ్.పి.ఎస్ పోరాటం

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 28:**





వికలాంగుల హక్కుల సాధన కోసం ప్రారంభమైన వికలాంగుల హక్కుల పోరాట సమితి (వి.హెచ్.పి.ఎస్) ప్రస్థానం 19వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. సంవత్సరాలు గడుస్తున్నా వికలాంగుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడంతో హక్కుల కోసం పోరాటం కొనసాగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని వికలాంగుల సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన వి.హెచ్.పి.ఎస్ 19వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇదే అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. జిల్లా కన్వీనర్ దేవరంపల్లి అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు.

**హామీ అమలుపై ఆశలు**

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా ఇంచార్జ్ వి.ఎస్. రాజు మాదిగ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఇచ్చిన రూ.6 వేల పింఛన్ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీ అమలుతో వికలాంగ కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు. హామీలను కాలయాపన చేయకుండా కార్యరూపంలోకి తీసుకురావాలని కోరారు.

**సంక్షేమం దాటి.. సాధికారత వైపు**

వికలాంగుల సమస్య అంటే కేవలం పింఛన్‌తో ముగిసిపోయే అంశం కాదని సంఘం నాయకులు పేర్కొన్నారు. విద్యలో అవకాశాలు, ఉపాధి కల్పన, స్వయం ఉపాధికి ప్రోత్సాహం, సామాజిక భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో సముచిత ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వికలాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వయం సాధికారత సాధించే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని కోరారు.

**పోరాటానికి 19 ఏళ్లు**

వి.హెచ్.పి.ఎస్ గత 19 సంవత్సరాలుగా వికలాంగుల హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహిస్తూ వస్తోందని నాయకులు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్నామని అన్నారు. భవిష్యత్తులోనూ సంఘాన్ని మరింత బలోపేతం చేసి వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వి.హెచ్.పి.ఎస్ సభ్యులు డేవిడ్, ముజీబ్, ఆసిఫ్, వీరయ్య, రవికుమార్, ఏసన్న, నవీన్ కుమార్, బంగారు కృష్ణ, మోహన్‌తో పాటు ఎం.ఆర్.పి.ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై మంత్రి ప్రత్యేక దృష్టి

## - జహీరాబాద్ ఆస్పత్రి ఘటనపై వెంటనే స్పందించిన దామోదర్ రాజనర్సింహ

## - నిర్లక్ష్యానికి తావులేకుండా విచారణకు ఆదేశం

## - ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల నమ్మకాన్ని పెంచే చర్యలు

**అందోల్, ఆగస్టు 28, (ప్రజాజ్యోతి):**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వ్యవహరిస్తున్న తీరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరు, వారి స్థానంలో ప్రైవేట్ వైద్యుడితో వైద్యం అందిస్తున్నారంటూ వచ్చిన వార్తలపై మంత్రి వెంటనే స్పందించడం ప్రజారోగ్యంపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది.ప్రభుత్వ ఆస్పత్రులను ప్రధానంగా పేద, మధ్యతరగతి ప్రజలు ఆశ్రయిస్తుంటారు. అలాంటి చోట వైద్య సేవల్లో ఎలాంటి లోపం ఉన్నా రోగులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### వార్తలపై వెంటనే స్పందన

జహీరాబాద్ ఆస్పత్రి వ్యవహారంపై వివిధ పత్రికల్లో కథనాలు వెలువడిన వెంటనే మంత్రి జిల్లా కలెక్టర్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తుతో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనపై తక్షణమే విచారణ జరిపించాలని ఆదేశించారు.డ్యూటీలో ఉండాల్సిన ప్రభుత్వ వైద్యుడు గైర్హాజరై, ప్రైవేట్ వైద్యుడు విధులు నిర్వహించడం తీవ్రమైన అంశంగా పేర్కొంటూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడం ద్వారా ప్రభుత్వ వైద్య వ్యవస్థలో జవాబుదారీతనానికి మంత్రి ప్రాధాన్యం ఇస్తున్నారనే సంకేతం ఇచ్చారు.

### తప్పిదం ఎక్కడ జరిగినా చర్యలు తప్పవన్న స్పష్టమైన సందేశం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరై రోగులకు అందుబాటులో ఉండేలా చూడటం అత్యంత కీలకం. ఈ విషయంలో నిర్లక్ష్యం జరిగితే అది ఎవరి స్థాయిలో ఉన్నా చర్యలు తప్పవన్న స్పష్టమైన సందేశాన్ని మంత్రి స్పందన ఇచ్చింది.కేవలం చర్యలకే పరిమితం కాకుండా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.



### ప్రజల నమ్మకానికి భరోసా

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవల నాణ్యత, వైద్యుల అందుబాటు, సిబ్బంది బాధ్యతాయుత విధుల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారిస్తే ప్రజలకు మరింత భరోసా కలుగుతుంది. జహీరాబాద్ ఘటనపై మంత్రి తక్షణ స్పందన కూడా ఇదే దిశగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, తప్పిదం చేసిన వారిపై చర్యలు తీసుకోవడం ద్వారా ప్రభుత్వ వైద్య సేవల్లో క్రమశిక్షణను మరింత బలోపేతం చేసే అవకాశం ఉంది. ప్రజల వైద్య హక్కులకు భంగం కలగకుండా, ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజలకు నమ్మకమైన వైద్య కేంద్రాలుగా ఉండాలన్న లక్ష్యానికి మంత్రి స్పందన బలాన్నిచ్చింది.

# పౌర్ణమి వేడుకల్లో వెల్లివిరిసిన అన్నాచెల్లెళ్ల అనురాగం

**కల్హేర్:28.ఆగస్టు. ప్రజా జ్యోతి**

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రజలు హర్షోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఊరువాడ తేడా లేకుండా అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు వెల్లివిరియడంతో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా కల్హేర్ మండలం మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డికి ఆయన చెల్లెళ్లు రాఖీ కట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా కల్హేర్ మండలంలోని అక్కాచెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాదేవి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.





### మాన్వి కంటి ఆసుపత్రి పూజలో పాల్గొన్న నర్సింహారెడ్డి

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మాన్వి కంటి ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సకల సౌకర్యాలతో అభివృద్ధి చెందుతూ ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించాలని, దుర్గాదేవి ఆశీస్సులతో ఆసుపత్రి విజయవంతంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

# రాజకీయాలకు అతీతంగా ఆత్మీయత.. దామోదర్‌కు రాఖీ

## - అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటిన రాఖీ వేడుకలు

## - మంత్రి సీతక్కతో పాటు మహిళా నేతల రాఖీ శుభాకాంక్షలు

## - ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించిన దామోదర్



**అందోల్, ఆగస్టు 28, (ప్రజాజ్యోతి):**

రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నివాసంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్కతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మహిళా నాయకురాళ్లు ఆయనను కలిసి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ కార్యక్రమాలకు భిన్నంగా అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకలు సందడి చేశాయి.మంత్రి సీతక్కతో పాటు మహిళా నేతలు రాఖీలు కట్టి మంత్రి దామోదర్‌కు శుభాకాంక్షలు తెలియజేయగా, ఆయన వారిని ఆప్యాయంగా పలకరించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా నేతలతో ఆయన ఆత్మీయంగా గడిపారు.

### ప్రజాసేవలో మరింత ఉన్నతంగా ఎదగాలి

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. మంత్రి సీతక్కతో పాటు రాఖీలు కట్టిన మహిళా నాయకురాళ్లను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. వారు ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని, ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### బంధాలను బలపరిచే పండుగ

రాఖీ పౌర్ణమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న పవిత్రమైన బంధం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.



రాజకీయ, సామాజిక రంగాల్లో చురుకుగా పనిచేస్తున్న మహిళా నాయకురాళ్లు ఒకే వేదికపై చేరి రాఖీ వేడుకల్లో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పరస్పర ఆత్మీయత, సోదరభావం, శుభాకాంక్షల మధ్య రాఖీ వేడుకలు సంతోషంగా సాగాయి.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.



# రైతుల ఇబ్బందులపై స్పందించిన సర్పంచ్ సాయికిరణ్

## - చింతగారి కుంట రహదారిపై మొరం పోయించి తాత్కాలిక పరిష్కారం



**అందోల్, ఆగస్టు 28, (ప్రజాజ్యోతి):**

వర్షాలతో బురదమయంగా మారి రైతులు, గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన చింతగారి కుంట రహదారిపై నేరడిగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ సాయికిరణ్ స్పందించారు. సమస్యను గుర్తించిన వెంటనే రహదారిపై అవసరమైన మేరకు మొరం పోయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.వ్యవసాయ పనుల సమయంలో రైతులు ఇబ్బందులు పడకుండా సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ సాయికిరణ్ తెలిపారు. వర్షాకాలంలో రహదారుల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.



# గ్రామీణ రవాణాకు కొత్త ఊతం..

# రోడ్డు పనులకు శంకుస్థాపన

## - అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

## - నాణ్యతతో పనులు పూర్తి చేస్తామని వజనాల విశ్వాస్ వెల్లడి





**ప్రజా జ్యోతి, ఆగస్టు 28, అందోల్:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా వట్టిపల్లి మండల పరిధిలోని వట్టిపల్లిబూత్కూర్ రహదారి అభివృద్ధికి రూ. 1.90 కోట్ల నిధులు మంజూరు కావడంతో రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంజూరు చేసిన నిధులతో చేపడుతున్న ఈ పనులు పూర్తయితే బూత్కూర్ గ్రామ ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది. వట్టిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వజనాల విశ్వాస్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మంత్రి దామోదర్ రాజనర్సింహ రోడ్డు అభివృద్ధికి రూ. 1.90 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

### రవాణా సౌకర్యానికి మెరుగులు

వట్టిపల్లి నుంచి బూత్కూర్కు వెళ్లే రహదారి అభివృద్ధి చెందడంతో గ్రామీణ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు తదితరులకు రాకపోకలు సులభతరం కానున్నాయి. రహదారి సౌకర్యం మెరుగుపడటం ద్వారా గ్రామాల మధ్య అనుసంధానం పెరగడంతో పాటు స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతం లభించే అవకాశం ఉంది.

### నాణ్యతకు ప్రాధాన్యం

మంజూరైన నిధులతో చేపట్టే పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు కృషి చేస్తామని వజనాల విశ్వాస్ తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్డు నిర్మాణం మాత్రమే కాదని, అది ప్రజల ప్రయాణానికి భరోసా కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు అందుబాటులోకి రావడంపై స్థానికులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయికోడు మండల ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, మరవెల్లి మాజీ సర్పంచ్ శివ శరణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ పాటిల్, ప్రశాంత్, రామ్‌రెడ్డి, పత్రి విఠల్, ఖాజా, శివశంకర్, వట్టిపల్లి సర్పంచ్ రవీందర్, శ్రీకాంత్‌రెడ్డి, నారాయణగౌడ్, అరవింద్, జానయ్య, మోహన్, మహిపాల్‌రెడ్డి, వీరేశం, శంకర్, లింగారెడ్డి, రుక్మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ బంధం.. సామాజిక ఐక్యతకు ప్రతీక

## - బొమ్మరెడ్డిగూడెంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

## - అన్నాచెల్లెళ్ల అనుబంధంతో పాటు సమాజ శ్రేయస్సు సందేశం

## - "మనమంతా దేశానికి, ధర్మానికి రక్ష" అంటూ ప్రతిజ్ఞ




**అందోల్, ఆగస్టు 28, (ప్రజాజ్యోతి):**
రక్షాబంధన్ పండుగను కేవలం అన్నాచెల్లెళ్ల అనుబంధానికే పరిమితం చేయకుండా సామాజిక ఐక్యత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిర్వహించారు బొమ్మరెడ్డిగూడెం గ్రామస్తులు. చౌటకూర్ మండలం



బొమ్మరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో రక్షాబంధన్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

### దారం కాదు.. బాధ్యతకు ప్రతీక

రాఖీ అనేది కేవలం ఒక దారం కాదని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, నమ్మకం, ఆత్మీయతకు ప్రతీక అని జైపాల్ నాయక్ అన్నారు. కుటుంబ బంధాలను బలోపేతం చేయడంతో పాటు కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలవాలనే బాధ్యతను ఈ పండుగ గుర్తుచేస్తుందని పేర్కొన్నారు.



### "మనమంతా దేశానికి రక్ష"

రక్షాబంధన్ సందేశాన్ని సామాజిక బాధ్యతతో ముడిపెడుతూ "నేను నీకు రక్ష.. నీవు నాకు రక్ష.. మనమందరం దేశానికి, ధర్మానికి రక్ష" అనే నినాదంతో వేడుకలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వ్యక్తిగత బంధాలకే కాకుండా సమాజం, దేశం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలనే సందేశాన్ని ఈ సందర్భంగా చాటారు. గ్రామంలో సోదరభావం, పరస్పర సహకారం, ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పండుగలు కేవలం సంప్రదాయాలను కొనసాగించడానికే కాకుండా సమాజంలో మానవీయ విలువలను పెంపొందించేందుకు దోహదపడాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుభాష్, అశ్విత కిట్టు, నాయకులు రవీందర్ కార్బరి, రాజు, బొమ్మ రాజు, శ్రీనివాస్, జైల్‌సింగ్, సర్వన్, మిన్‌పూర్ బుచ్చయ్య, బద్రీనాథ్, శివ, రణిజ్యా, మునిలాల్, సుభాష్, ఇంద్రు, తిలక్, అభిలాస్, అకేష్, రాహుల్, ప్రభు, పాండు తదితరులు పాల్గొన్నారు.